పోలీస్‌స్టేషన్‌కు ఎల్ ఈడీ లైట్ల అందజేత

బీబీపేట ఎస్సైకు ఎల్‌ఈడీ లైట్లును అందజేస్తున్న మండల కో-ఆప్షన్ సభ్యుడు ఆసీఫ్

బీబీపేట్, మే 26: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కుమండల కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆసీఫ్ రెండు ఎల్‌ఈడీ లైట్లను వితరణ చేశారు. ఈ మేరకు వాటిని ఎస్సై ప్రభాకర్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆసీఫ్‌ను ఎస్సై అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈత వనంలో అగ్ని ప్రమాదం

పెద్దమల్లారెడ్డిలో దగ్ధమవుతున్న ఈతచెట్లు

భిక్కనూరు, మే 26: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులో ఉన్న ఈత వనంలో అదివారం అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో 50 నుంచి వంద చెట్లు కాలిపోయాయి. ఇది అగ్ని ప్రమాదమా లేక ఎవరైనా కుట్ర పూరితంగా దహనం చేశారా అని తెలియాల్సి ఉందని గౌడ సంఘ సభ్యులు బాలగౌని రాజగౌడ్, రమేశ్ గౌడ్ అనుమానం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

ఆర్మూర్‌టౌన్,మే26: పట్టణంలోని రాజరాంనగర్‌లో ఓ బాలిక(12)పై లైంగికదాడికి పాల్పడిన కేసులో వ్యక్తిపై పోక్సో చట్టంకింద కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. శనివారం బాలిక తల్లిదండ్రులు రోజువారి పనిలో భాగంగా కూలీ పనులకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన నిందితుడు బాలికకు మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

బోధన్ రూరల్, మే 26: నిజామాబాద్ జిల్లా సాలూరా మండలంలోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీ కొని జింక మృతి చెందింది. స్థానికులు జింకకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఈదురు గాలుల బీభత్సం

- బాన్సువాడ మండలంలో ఎగిరిన ఇంటి పైకప్పులు
- విరిగిన విద్యుత్ స్తంభాలు
- రోడ్లపై కూలిన చెట్లు

బోర్లం గ్రామ పంచాయతీ భవనం ఎదుట నేలకూలిన భారీ వృక్షం

బాన్సువాడ రూరల్/బాన్సువాడ టౌన్, బాన్సువాడ, మే 26 : బాన్సువాడ మండలంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం మధ్యాహ్నం వీచిన ఈదురు గాలులకు బోర్లం, బుడిమి, తాడ్కోల్, కొత్తాబాది తదితర గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. బోర్లం గ్రామంలో 15 విద్యుత్ స్తంభాలు, 10 వ్యవసాయ విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 20 ఇండ్ల వరకు పైకప్పులు గాలికి కొట్టుకుపోయాయి. భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. బాన్సువాడ - కామారెడ్డి ప్రధాన రహదారిపై కొయ్యగుట్ట వద్ద భారీ వృక్షం రోడ్డుపై పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బోర్లం గ్రామంలో నిరుపేద కుటుంబాలకు చెందిన వారి ఇంటి పైకప్పులు ఎగిరిపోవడంతో రోడ్డున పడ్డారు. ఇండ్లు నేలమట్టం కావడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వీచిన ఈదురు గాలులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిన ప్రాంతాల్లో అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

మినీట్యాంక్‌బండ్‌పై..

బాన్సువాడ పట్టణంలో మినీట్యాంకు బండ్‌పై ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, హైమాస్ట్ లైట్లు, సోలార్ ప్యానల్ నేలకూలాయి. ట్యాంకుబండ్‌పై పర్యాటకులు కూర్చోవడానికి నిర్మించిన కుటీరం పైకప్పులు ఎగిరిపోయాయి. విషయం తెలుసుకున్న బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఈదురుగాలులు, అకాల వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాన్సువాడ మండలం కొయ్యగుట్ట వద్ద ఓ పెట్రోల్ బంక్ పైకప్పు ఎగిరిపోయింది.

పీఎస్ఆర్ బీడీ వర్కర్స్ కాలనీలో కూలిపోయిన గణపతి మండపం రేకుల షెడ్డు

మినీ ట్యాంకుబండ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

కొయ్యగుట్ట వద్ద పెట్రోల్ బంక్‌పై కూలిన రేకులు

కల్కి చెరువు వద్ద ధ్వంసమైన శిలాఫలకం

బాన్సువాడ - కామారెడ్డి ప్రధాన రహదారిపై కూలిన చెట్టు

కల్కి చెరువు వద్ద కూలిన హైమాస్ట్ లైట్లు

307 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

జంగంపల్లిలోని రైస్‌మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భిక్కనూరు, మే 26: జిల్లాలో ఇప్పటివరకు 307 కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేశామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను సందర్శించి పలు సూచనలు చేశారు. ముందుగా అంతంపల్లి, రామేశ్వరపల్లి, భిక్కనూరులో కొనుగోలు కేంద్రాలు, జంగంపల్లి శాకంబరి రైస్‌మిల్‌ను పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జి జిల్లా మేనేజర్ నిత్యానందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ఇంకా 43 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేయాల్సి ఉందని తెలిపారు. రెండు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఆదివారం 116 లారీలు ఏర్పాటు చేసి 2,795 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరలించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్లు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు ఉన్నారు.

కురుమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రశంసాపత్రాలు అందుకున్న కురుమ విద్యార్థులు

కామారెడ్డి, మే 26: సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా వెనకబడిన కురుమలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కురుమ యువ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 60 మంది కురుమ విద్యార్థులకు కురుమ చైతన్య సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గొరె నర్సింహ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్, జిల్లా ఉపాధ్యాక్షులు స్వామి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఐదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న 1998-99 బ్యాచ్ ఐదో తరగతి విద్యార్థులు

ఎల్లారెడ్డి రూరల్, మే 26: 25ఏండ్ల అనంతరం ఐదో తరగతి విద్యార్థులు కలిసి సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎల్లారెడ్డిలోని జేబీఎస్ పాఠశాలలో 1998-99వ విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివిన వారందరూ ఆదివారం నిజాంసాగర్‌లో కలుసుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులు చేస్తున్న మిత్రులందరూ కలిసి తమ వివరాలను ఒకరితో ఒకరు పంచుకొని సందడి చేశారు. సిద్ధు, హరీశ్‌గౌడ్, బాలు, కిట్టు, ప్రవీణ్, రాధ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాల సమర్పణ

బోనాలను తీసుకెళ్తున్న గ్రామస్తులు

గాంధారి, మే 26: మండల కేంద్రంలోని గ్రామ దేవతలకు ఆదివారం బోనాలను సమర్పించారు. మహిళలు ఇంటికొక బోనం చొప్పున భాజాభజంత్రీల నడుమ ఊరేగించారు. గ్రామ దేవతలైన నాయకమ్మ, లస్మమ్మ, పోచమ్మ, పెద్దమ్మకు సమర్పించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అడ్డదారిలో సరుకు రవాణా

- అధికారుల కండ్లుగప్పి..
- ప్రభుత్వ ఆదాయానికి గండి

మద్నూర్, మే 26: తెలంగాణ నుంచి మహారాష్ట్రకు, అటునుంచి ఇక్కడికి అడ్డదారిలో సరుకు రవాణా జరుగుతున్నది. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద అంతర్రాష్ట్ర రావాణా, ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటిని తప్పించుకునేందుకు అక్రమార్కులు అడ్డదారులను వెతుకుతున్నారు. అందులో భాగంగా మండలంలోని పెద్దతడ్గూర్ మార్గంలో ఉన్న మహారాష్ట్రలోని నాగ్రాల్, భక్తాపూర్ మీదుగా దెగ్లూర్‌కు సరుకులను తీసుకెళ్తున్నారు. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో వాహనాలు అధికలోడుతో అక్రమ మార్గంలో వెళ్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. ఇసుకతోపాటు నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ వస్తువుల లారీలు రాత్రింబవళ్లు నడుస్తున్నాయి. సంబంధిత శాఖల అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి సైతం అక్రమంగా మద్యం, దేశీదారు తెలంగాణలోకి సరఫరా అవుతున్నది. అధిక లోడ్‌తో వాహనాలు తిరుగుతుండడంతో రోడ్లు సైతం ధ్వంసం అవుతున్నాయి. నిత్యం లక్షల రూపాయల్లో ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతున్నది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఎప్పుడో అడపా దడపా తనిఖీ చేసి అక్కడే ఎంతో కొంత తీసుకొని వదిలేస్తున్నట్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మిట్ట మధ్యాహ్నం పెద్ద పెద్ద వాహనాలు తరలుతున్నా అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు మాత్రం తనిఖీలు చేస్తూ పెద్ద వాహనాల గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాగా చిన్నవారిపై ప్రతాపం చూపుతున్నారని ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారిపై చెక్‌పోస్టుల్లో పనిచేస్తున్న వారు తమ ముందు నుంచి వెళ్లే వాహనాలను మాత్రమే తనిఖీ చేస్తున్నారు. ఇదే అదనుగా భావించి అక్రమార్కులు అడ్డదారుల్లో దర్జాగా ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అడ్డదారిలో అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నదని మండల ప్రజలు అంటున్నారు.

మద్నూర్ మండలంలో అడ్డదారిలో వెళ్తున్న లారీలు

అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం..

మండలం మీదుగా సరుకుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని జిల్లా రవాణా శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ద్వారా తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికడతాం. ఇక్కడ చెక్‌పోస్టులో స్టాఫ్ తక్కువగా ఉన్నది. తనిఖీలు చేపట్టి అక్రమంగా తరిలే వాహనాలకు ట్యాక్స్ వసూలు చేసి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

- సుభాష్, మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, సలాబత్‌పూర్ చెక్‌పోస్ట్

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, BANDARI SURESH GANGARAM, H.No.6-91, SC WADA, Padkal (M) Jakranpally, (D) Nzb changed my name as BANDARI BHASKAR S/o.YELLAIAH.
NTZ-324694

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కొనసాగుతున్న గాంధారి ప్రీమియర్ లీగ్

పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

గాంధారి, మే 26: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల మైదానంలో గాంధారి ప్రీమియర్ లీగ్(జీపీఎల్) సెకండ్ సీజన్ క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈనెల 20న ప్రారంభమైన జీపీఎల్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన పది జట్లు పాల్గొంటున్నాయి. లీగ్ దశలో భాగంగా ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో శ్రీకాంత్, తరుణ్ జట్లు తలపడగా.. శ్రీకాంత్ జట్టు విజయం సాధించింది, రెండో మ్యాచ్‌లో కళ్యాణ్, నితిన్ జట్లు తలపడగా.. కళ్యాణ్ జట్టు గెలుపొందింది. జూన్ రెండో తేదీన ఫైనల్ మ్యాచ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై గణేశ్

ఎల్లారెడ్డి రూరల్, మే 26: చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల ఆచూకీని సీఈఐఆర్ ద్వారా తెలుసుకోవచ్చని ఎస్సై బొజ్జ గణేశ్ అన్నారు. మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన నీల కిష్టయ్య, ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గణపతికుమార్, హసన్‌పల్లి గ్రామానికి చెందిన కుశలకంటి దుర్గయ్య సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఐఎంఈఐ ఆధారంగా వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేసి వాటి ఆచూకీ కనుగొన్నారు. సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ సైడ్‌వాల్

నాగిరెడ్డిపేట, మే 26: పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ సైడ్‌వాల్ కూలి ప్రమాదకరంగా మారింది. పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్లు వదిలే ప్రదేశానికి కొద్ది దూరంలోనే సైడ్‌వాల్ దెబ్బతిన్నది. సైడ్‌వాల్ రాళ్లు ఊడిపోయి కోతకు గురైంది. త్వరలో వానకాలం ప్రారంభం అవుతున్నందున సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి సైడ్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఇంటర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, మే 26: పట్టణంలోని మోడల్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని, ప్రతి గ్రూపులో 40 సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. www.tsmodelschools.com అనే వెబ్‌సైట్‌లో మీ సేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 9701194909 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నిజంసాగర్, మే 26: మండలంలోని కొమలంచ గ్రామంలో లయన్స్ కేర్ ఆప్టికల్స్ వారి సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణుడు నాగరాజు గ్రామస్తులను పరీక్షించారు. అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి కామారెడ్డిలో చేయిస్తామని నిర్వాహకుడు సతీశ్ తెలిపారు.